క్లుప్తంగా

రూ.6 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం



కొత్తగా నిర్మించిన సీసీ కాలువ

రాజాం: మండలంలోని పెనుబాక గ్రామంలో రూ.6 లక్షల వ్యయంతో సీసీ డ్రైనేజీ నిర్మించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో ఈ నిర్మాణం చేపట్టినట్లు సర్పంచ్ బండి బోడమ్మ తెలిపారు. గ్రామ ప్రధాన వీధి నుంచి గ్రామ శివారు వరకు ఈ సీసీ కాలువ నిర్మించడం జరిగిందని, దీర్ఘకాలిక సమస్య ప్రస్తుతం పరిష్కారం కావడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు.

విత్తన గుళికల తయారీపై అవగాహన

రేగిడి: మండలంలోని సోమరాజుపేట గ్రామంలో విత్తన గుళికల తయారీపై ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మంగళవారం అవగాహన కల్పించారు. కందులు, మినుములు, పెసలు, జొన్నలు, సజ్జలు, అలసందలు, మొక్కజొన్న వంటి రకరకాల విత్తనాలను విత్తన గుళికలుగా తయారు చేసుకుని, పొలంలో వేసుకుంటే పంట బాగా పండుతుందన్నారు. అలాగే పంటకు చీడపీడలు కూడా అంతగా సోకవన్నారు. ప్రతీ రైతు ప్రకృతి వ్యవసాయం వైపు ఆసక్తి కనబరచాలని, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా చేసే సాగుతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు ఇచ్చే పంట చేతికి వస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.రమేష్‌నాయుడు, అగ్రికల్చర్ అసిస్టెంట్ అసిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు



సుబ్రహ్మణ్యస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

రేగిడి: మండలంలోని ఆమదాలవలస, రేగిడి, గోపెంపేట, అంబకండి, సంకిలి గ్రామాల్లోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో మంగళవారం పూజలు నిర్వహించారు. ఆమదాలవలస ఆలయ పూజారి కిన్నెరకాంతం అన్నారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

యోగాతో ఆరోగ్యం

రేగిడి: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ప్రతిఒక్కరూ తప్పనిసరిగా యోగా చేయాలని హైకోర్టు న్యాయవాది మామిడి వేణుగోపాలనాయుడు తెలిపారు. స్థానిక విశ్వసాయి మందిరంలో విద్యార్థులకు ఉచితంగా నిర్వహిస్తున్న ధ్యాన యోగా తరగతులకు మంగళవారం హాజరైన ఆయన.. ఆరోగ్యంలో యోగా, ధ్యానం ప్రాముఖ్యాన్ని విద్యార్థులకు వివరించారు. ధ్యానం ద్వారా జ్ఞాపక శక్తి పెరుగుతుందని, ప్రతీ విద్యార్థి ధ్యానం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సత్యసాయి భజన మండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ వితరణ



సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ ట్యాంకర్

రాజాం: మండలంలోని పెనుబాక గ్రామ సచివాలయానికి అదే గ్రామానికి చెందిన జెడ్పీటీసీ బండి నర్సింహులు కుటుంబ సభ్యులు మంగళవారం వాటర్ ప్లాంట్ వితరణ చేశారు. ఉద్యోగులు, అక్కడికి వచ్చే ప్రజలకు తాగునీటి సౌకర్యార్థం తల్లి బండి సత్యవతి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులంతా కలిసి రూ.2 లక్షలతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నామని జెడ్పీటీసీ తెలిపారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

బొబ్బిలి: సుప్రీంకోర్టులో జూలై 29 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు ప్రత్యేక లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి అరుణశ్రీ ఓ ప్రకటనలో మంగళవారం కోరారు. అన్నిరకాల కేసులు పరిష్కరించడం జరుగుతుందని, లోక్‌అదాలత్ అందులో లభ్యమయ్యే న్యాయసేవలపై న్యాయవాదులు కూడా అవగాహన కల్పించాలని తెలిపారు.



రాజాం: ఓటు వేసేందుకు క్యూలైన్‌లో నిల్చొన్న ఓటర్లు (ఫైల్)

ఓటెత్తారు..!

- నజావుగా సార్వత్రిక ఎన్నికలు–2024
- ఓటింగ్‌కు ఆసక్తి కనబరిచిన ఓటర్లు
- గతంలో కన్నా స్వల్పంగా పెరిగిన ఓటింగ్ శాతం
- బ్యాలెట్ బాక్సులలో అభ్యర్థుల భవితవ్యం

బొబ్బిలి:

రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు–2024 ప్రశాంతంగా ముగిశాయి. సోమవారం జరిగిన పోలింగ్‌లో నియోజకవర్గంలోని ఓటర్లంతా తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు వెళ్లి, ఓటుహక్కును సద్వినియోగం చేసుకున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 2,31,232 మందికి గాను 1,85,774 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలోని 1,14,216 పురుష ఓటర్లలో 91,157 మంది ఓటు వేయగా, 1,17,006 మంది మహిళా ఓటర్లలో 94,612 మంది, ఇతరుల్లో 10 మందికి గాను ఐదుగురు ఓటు వేశారు. బొబ్బిలి పట్టణం, మండలం కలిపి మొత్తం ఓటర్లు 1,03,378 మంది ఉండగా, 81,282 మంది ఓటు వేశారు. రామభద్రపురం మండలంలో 38,371 మందికి గాను 32,135 మంది, బాడంగి మండలంలో 39,691 మందికి 32,508 మంది, తెర్లాం మండలంలో 49,792 మందికి గాను 39,850 మంది ఓటు వేశారు. ప్రస్తుతం ఎన్నికలు ముగియడంతో ఏ పార్టీ గెలుస్తుందన్న అంచనాల్లో ప్రజలు, వివిధ పార్టీల నాయకులు నిమగ్నమయ్యారు.

రాజాం: నియోజకవర్గంలో అత్యధికంగా ఓటింగ్ ఈ ఎన్నికల్లో నమోదైంది. రాజాం మండలంలోని ఆగూరు, కొటారిపురంతో పాటు సంతకవిటి మండలంలోని గోవిందపురం గ్రామంలో అర్ధరాత్రి వరకు పోలింగ్ జరిగింది. మొత్తం 76 శాతం పోలింగ్ జరిగింది. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం ఓటర్లు 2,27,503 మంది ఉండగా, ఈ ఎన్నికల్లో 1,72,906 మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకున్నట్లు రాజాం ఎన్నికల అధికారి ఎల్.జోసెఫ్ తెలిపారు. ఓటర్లలో 86,928 మంది పురుష ఓటర్లు ఉండగా, 85,974 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఇతరులు నలుగురు ఓటు వేశారు. రేగిడి మండలంలో 56,649 మంది ఓటర్లకు గాను 44,620 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక్కడ నియోజకవర్గంలోనే అత్యధికంగా 79 శాతం ఓటింగ్ నమోదైంది. తరువాతి స్థానంలో రాజాం మున్సిపాలిటీతో పాటు రాజాం మండలంలో మొత్తం 78,302 మంది ఓటర్లలో 58,760 మంది ఓటర్లు తమ ఓటు వేశారు. దీంతో 76 శాతం ఓటింగ్ నమోదైంది. సంతకవిటి మండలంలో 57,127 మంది ఓటర్లకు గాను 43,095 మంది ఓటర్లు ఓటు వేశారు. దీంతో ఇక్కడ 76 శాతం పోలింగ్ నమోదు కాగా, వంగర మండలంలో 35,425 మందికి గాను 26,431 మంది ఓటర్లు ఓటు వేశారు. ఈ నేపథ్యంలో ఇక్కడ 74 శాతం పోలింగ్ నమోదైంది.

ఓటర్లకు కృతజ్ఞతలు



ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్

రాజాం: తనకు మద్దతు తెలిపిన ఓటర్లందరికీ కృతజ్ఞతలని వైఎస్సార్ సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ తెలిపారు. సోమవారం సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరగ్గా స్థానిక పట్టణంలోని ఆయన స్వగృహంలో మంగళవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ చాలా గ్రామాల్లోని ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. రాత్రి 10 గంటలైనా ఓటర్లు ఎంతో ఓపికతో క్యూలైన్లలో నిలబడి ఓట్లు వేసి, ప్రజాస్వామ్య స్ఫూర్తి కనబరిచారన్నారు. తనకు మద్దతు తెలిపిన పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, బంధువులకు ధన్యవాదాలన్నారు. రాజాంలో తన గెలుపు ఖాయమన్నారు.

భానుడి ప్రతాపం



రామభద్రపురంలో గొడుగు నీడలో నడిచి వస్తున్న మహిళలు

రామభద్రపురం: భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. ఉదయం 9 గంటలకే తీవ్రమైన ఎండ కాయడంతో పాటు ఉదయం 11.30 గంటల నుంచే వేడిగాలులు వీస్తున్నాయి. దీంతో అవసరాల నిమిత్తం బయటకు వచ్చేందుకు కూడా ప్రజలు బెంబేలెత్తున్నారు.

రోజురోజుకూ ఎండలు పెరిగిపోవడంతో వ్యవసాయ పనులకు వెళ్లిన రైతులు కూడా ఉదయం 10 గంటలకే ఇళ్లకు చేరుకుంటున్నారు. ప్రయాణికులు సైతం తమ ప్రయాణాలను ఉదయమే ఉండేలా చూసుకుంటున్నారు. వేసవి ఎండల నేపథ్యంలో ఎప్పుడూ ప్రయాణీకులతో రద్దీగా ఉండే రామభద్రపురం జాతీయ రహదారి మంగళవారం నిర్మానుష్యంగా దర్శనమిచ్చింది. ఎండల వేడి తట్టుకోలేక మధ్యాహ్నం 12 గంటలకే వ్యాపారులు తమ దుకాణాలు మూసివేశారు. ఇదే పరిస్థితి ఇంకెన్నాళ్లు కొనసాగుతుందోనని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి



మాట్లాడుతున్న వైద్యాధికారి అసిరినాయుడు

రేగిడి: వేసవి ఎండల నేపథ్యంలో ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి జి.అసిరినాయుడు సూచించారు. ఇదే విషయమై మంగళవారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. రోజురోజుకూ ఎండల తీవ్ర పెరుగుతోందని, చిన్నపిల్లలతో ప్రయాణం చేసేటప్పుడు ఎండ తగలకుండా చూసుకోవాలని తెలిపారు. ఎండలకు శరీరంలోని నీరంతా చెమట రూపంలో బయటకు పోతుందని, నిమ్మరసం, ఫ్లూయిడ్స్ వంటివి తరచూ తాగాలన్నారు. డయేరియా వంటి వ్యాధుల బారినపడిన వెంటనే సంబంధిత ఆశావర్కర్ల ద్వారా సమాచారం తెలియజేయాలన్నారు. ప్రతిరోజూ గ్రామాల్లో ఇంటింటా ఫీవర్ సర్వే చేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, అవసరమైన మందులు, ఆధునిక పరికరాలతో కూడిన ల్యాబ్‌లు ఉన్నాయని ఎటువంటి పరీక్షలు చేసుకోవాలన్నా పీహెచ్‌సీకి వస్తే వెంటనే చేస్తామన్నారు.

మంత్రి బొత్సను కలిసిన కడుబండి



మంత్రి బొత్సను కలిసిన ఎమ్మెల్యే శ్రీనివాసరావు, డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు

వేపాడ: మంత్రి బొత్స సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ విశాఖపట్నం ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిని ఎస్.కోట ఎమ్మెల్యే కడు బండి శ్రీనివాసరావు విశాఖపట్నంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్.కోట నియోజకవర్గంలో పోలింగ్ సరళిని మంత్రి బొత్సకు ఎమ్మెల్యే కడుబండి వివరించారు. మంత్రి బొత్సను కలిసిన వారిలో డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు, తదితరులు ఉన్నారు.

కేసు నమోదు

గజపతినగరం: కొత్తశ్రీరంగరాజపురం గ్రామంలో పీఓ (పోలింగ్ ఆఫీసర్)గా సోమవారం ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న తనపై కొంతమంది గ్రామస్తులు సమూహంగా దాడి చేశారని పీఓ రాంబాబు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. స్థానిక ఎస్ఐ యు.మహేష్ తెలిపిన వివరాలు.. పీఓ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, విచారణ నిర్వహించి దాడి చేసిన వారిని అదుపులోకి తీసుకుంటామని ఎస్ఐ చెప్పారు.

జగన్ ముఖ్యమంత్రి కావాలని పూజలు



రాయగడలో మజ్జిగౌరమ్మ ఆలయం వద్ద కందిశ గ్రామస్తులు

రేగిడి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని మండలంలోని కందిశ గ్రామస్తులు.. ఒడిశాలోని రాయగడలో ఉన్న మజ్జిగౌరమ్మకు మంగళవారం పూజలు చేశారు. ఈ ఐదేళ్లు ప్రజలకు ఎన్నోవిధాలా మేలు చేసిన జగనన్నే మళ్లీ మళ్లీ సీఎం అయ్యేలా ఆశీర్వదించాలని అమ్మవారిని వేడుకున్నామని, జూన్ 4వ తేదీన వెల్లడయ్యే ఎన్నికల ఫలితాలు వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉండాలని పూజించినట్లు సర్పంచ్ కెల్ల మన్మధరావు తెలిపారు.

ముగిసిన వేసవి శిక్షణా తరగతులు



బహుమతులతో విద్యార్థులు

రాజాం సిటీ: స్థానిక వికాస తరంగిణి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజ్ఞ వేసవి ఉచిత శిక్షణా తరగతులు మంగళవారంతో ముగిశాయి. పది రోజుల పాటు కొనసాగిన ఈ శిక్షణలో మన ఋషులు, పంచతంత్ర కథలు, నీతి పద్యాలు, శ్లోకాలు, రామాయణంలోని బాలకాండ, యోగాసనాలు వంటి వాటిని వివరించామని వికాస తరంగిణి అధ్యక్షుడు టీటీవీ రమణమూర్తి తెలిపారు. అలాగే క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు సైతం అందజేసి, ప్రోత్సహించామన్నారు. ఇటువంటి తరగతులు చిన్నారుల్లో జ్ఞాపకశక్తి పెరిగేందుకు దోహదపడడంతో పాటు మన సంస్కృతీ, సంప్రదాయాలపై అవగాహన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బి.కృష్ణారావు, ప్రజ్ఞ కో–ఆర్డినేటర్ ఎం.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం కోసం పని చేసిన నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులకు ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక బెల్లాన కన్వెన్షన్ హాల్‌లో దత్తిరాజేరు, గంట్యాడ, గజపతినగ రం, బొండపల్లి, జామి మండలాల నాయకులు, కార్యకర్తలతో మంగళవారం సమావేశమయ్యారు. మండలాల వారీగా నాయకులతో మాట్లాడి పోలింగ్ సరళి, బూత్‌ల వారీగా పార్టీకి వచ్చే ఓట్లపై ఆరా తీశారు. అన్ని మండలాల నుంచి వైఎస్సార్ సీపీకి మెజార్టీ వస్తుందని, గెలుపుపై ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణమూర్తి రాజు, పార్టీ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, గజపతినగరం, దత్తిరాజేరు, గంట్యాడ మండలాల జెడ్పీటీసీలు గార తవుడు, రౌతు రాజేశ్వరి, వర్రినరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



రంగనాథంను సత్కరిస్తున్న రాజాం రెడ్‌క్రాస్, మానవతా సేవా సంస్థ సభ్యులు

రాజాం సిటీ: రారవే(రాజాం రచయితల వేదిక) నిర్వాహకులు, ప్రముఖ రచయిత గార రంగనాథంను రాజాం రెడ్‌క్రాస్ సంస్థ, మానవతా సేవా సంస్థ సభ్యులు కలిసి మంగళవారం సన్మానించారు. రంగనాథం రచించిన రాయరత్నం మంజూష గ్రంథానికి గాను హైదరాబాద్‌లో ఈ నెల 12వ తేదీన జరిగిన ఓ కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి చేతుల మీదుగా చెన్నమనేని రంగనాయకమ్మ విశిష్ట అద్వైత సాహిత్య పురస్కారాన్ని ఆయన అందుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని స్థానిక పట్టణంలోని ఆయన నివాసానికి చేరుకున్న ఇరు సంస్థల సభ్యులు దుశ్శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, మానవతా సేవా సంస్థ కార్యదర్శి ఉల్లాకుల నీలకంఠేశ్వరయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ‘ఉపాధి’ పనులు



తెర్లాంలో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు

తెర్లాం:

మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు చాలా జోరుగా జరుగుతున్నాయి. వేసవి ఎండలు ఎక్కువగా ఉండడంతో వేతనదారులు ఉదయం 6 గంటల నుంచే పని ప్రదేశానికి వెళ్లి, పనులు చేస్తున్నారు. వడదెబ్బకు గురికాకుండా వేతనదారులంతా ఇంటి నుంచే నీరు, మజ్జిగ వెంట తీసుకురావాలని క్షేత్ర సహాయకులు సూచిస్తున్నారు. అలాగే పనులు జరిగే చోట నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేయడం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయడం, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచుకోవడం వంటివి చేస్తున్నారు. మంగళవారం పలు గ్రామాల్లో జరుగుతున్న పనులను ఉపాధి హామీ పథకం సాంకేతిక సహాయకులు పరిశీలించారు. తెర్లాంలో పనులను టీఏ జి.త్రినాధనాయుడు పరిశీలించి, వేతనదారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. నిర్ణీత కొలతల ప్రకారం పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందని తెలిపారు. మేట్లు సకాలంలో వేతనదారుల మస్తర్లు పంపించాలన్నారు. జాబ్ కార్డు ఉన్న వారినే పనులకు అనుమతించాలన్నారు. తప్పుడు మస్తర్లు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు



గ్రావెల్ తవ్వకాలతో గోపాలపురం చెరువులో ఏర్పడిన గుంతలు

రాజాం: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న సాగునీటి చెరువుల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయి. రాత్రికి రాత్రే చెరువుల వద్దకు వాహనాలతో వెళ్లి, గ్రావెల్ తవ్వి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీంతో చెరువుల ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విచ్చలవిడిగా జరుగుతున్న గ్రావెల్ తవ్వకాలతో పాటు గ్రావెల్ లోడు ట్రాక్టర్లు వెళ్లేందుకు వీలుగా గట్లు ప్రొక్లెయిన్‌లతో తొలగిస్తున్నారని, వర్షాకాలంలో కురిసే వర్షాలకు బలహీనమయ్యే గట్లు చాలా సులువుగా కొట్టుకుపోయే ప్రమాదం ఉందని వాపోతున్నారు. గోపాలపురం, పాగిరి ప్రాంతాల చెరువుల నుంచి గ్రావెల్ అక్రమ రవాణా జోరుగా జరుగుతోందని రైతులు చెబుతున్నారు. రాజాం పట్టణంలో భవన నిర్మాణాలకు వీటిని తరలిస్తున్నారని, రెవెన్యూ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా వారాల పండగ



నల్ల మారమ్మ గుడి వద్ద పూజలు చేస్తున్న భక్తులు

దత్తిరాజేరు: మండలంలోని పెదకాద గ్రామంలో గ్రామ దేవత నల్ల మారమ్మ తల్లి వారాల పండగను గ్రామస్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి గుడికి గ్రామస్తులు ఉదయాన్నే చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. పసుపు,కుంకుమ, చీరలు సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు.